క్లుప్తంగా

తమ్ముడిపై కత్తితో దాడి

నెల్లూరు సిటీ: ఆస్తి తగాదాల నేపథ్యంలో తమ్ముడిపై కత్తితో అన్న దాడికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. వావిలేటిపాడులో నివసిస్తున్న సోదరులు వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్ మధ్య ఆస్తి తగాదాలు కొంతకాలంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో విజయ్‌కుమార్‌పై కత్తితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయన ఆస్పత్రిలో చేరారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విజ్ఞాన శిబిరాలతో మానసికోల్లాసం



పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

మనుబోలు : వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుందని లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ అన్నారు. మనుబోలు మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు నీతి కథల గురించి వివరించి వారితో కథల పుస్తకాలు చదివించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేలా వివిధ రకాల కార్యక్రమాలను రూపొందించామన్నారు. ఈ శిబిరాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యోగా ట్రైనర్ కోటేశ్వరరెడ్డి యోగా క్లాసులు నిర్వహించారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల సరఫరా

వరికుంటపాడు: మండలంలోని రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 కేజీల జీలగలు రాయితీ పోను రూ.440లకు, జనుములు రూ.440లకు, 8 కేజీల పిల్లిపెసర్లు రూ.536లకు పొందేందుకు రైతుభరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఒక ఎకరాకు ఒక సంచి చొప్పున, ఐదెకరాల వరకు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకం ద్వారా భూమిలో కర్బనశాతం పెరగడంతోపాటు స్థూల, సూక్ష్మ పోషకాలు మొక్కలకు అందేందుకు తోడ్పడుతాయని తెలిపారు.

సీతారాములకు గ్రామోత్సవం

వరికుంటపాడు: మండలంలోని సాతువారిపల్లె గ్రామంలో గత మూడు రోజులుగా శ్రీసీతారాముల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ అర్చకుడు లోకా ప్రసాద్‌శర్మ స్వామివార్లకు విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి ఉత్సవంగా ఊరబావి వద్దకు తీసుకెళ్లి వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం పార్వేట, లంకాదాహనం కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవాలను ముగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

సీతారామపురం: మండలంలోని గుండుపల్లి గ్రామంలో సీతా సమేత ప్రసన్న కోదండరామ స్వామి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం గ్రామదేవత పోలేరమ్మ తల్లికి భక్తులు చలిపిండి, పానకాలు, చద్ది, పొంగళ్లు సమర్పించారు. మహిళలు తమ గృహాల నుంచి పొంగలి సామగ్రిని కొత్త గంపల్లో తీసుకొని తప్పెట్ల చప్పుళ్ల మధ్య పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకొని పొంగళ్లు పొంగించి అమ్మవారికి సమర్పించారు. స్థానికులతోపాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పాండురంగడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సీతారామపురం: మండలంలోని నారాయణప్పపేట సమీపంలో ఉన్న పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం నారాయణప్పపేట, పాండురంగాపురం, సంగసానిపల్లి, రాజుగారి, ఏనుగులవారి, లకం వారి, నూతివారి కొట్టాల ప్రజలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సాయంత్రం సీతారామపురం కోటవీధి ప్రజలు అంకురార్పణ, ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాశీనాయన ఆశ్రమ నిర్వాహకురాలు శివమ్మ భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సోమవారం హనుమంతసేవ నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ తెలిపింది.

త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల పంపిణీ

వరికుంటపాడు: ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామంలో ఆదివారం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక దుత్తలూరు శాఖ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను సేవా సమితి సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.ప్రసాద్, కె.వెంకటేశ్వర్లు, నాగమ్మ, రమణయ్య, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందం.. ఆహ్లాదం





సుందరంగా సత్యనారాయణపురం పార్కు

- కళకళలాడుతున్న సత్యనారాయణపురం పార్కు
- రూ.20 లక్షలతో ఆధునికీకరణ
- వాకింగ్ ట్రాక్, వ్యాయామ పరికరాల ఏర్పాటు

నెల్లూరు(బారకాసు): నగరంలోని అనేక పార్కులను నగరపాలక సంస్థ ఎంతో సుందరంగా తీర్చిదిద్దింది. దీని కోసం నిధులను భారీగా వెచ్చించారు. కార్పొరేషన్ పరిధిలోని 54 డివిజన్లలో గల అధిక ప్రాంతాల్లో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేలా పార్కులను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఐదో డివిజన్లోని సత్యనారాయణపురంలో గల పార్కు కొత్త అందాలతో ముస్తాబైంది. గతంలో నుడా పరిధిలో ఉన్న ఈ పార్కును కొంత మేర అభివృద్ధి చేసి నగరపాలక సంస్థకు అప్పగించారు. ఈ క్రమంలో మరింత అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో రూ.20 లక్షలను కేటాయించారు. ఈ మొత్తంతో పార్కును అన్ని విధాలా అభివృద్ధి చేశారు. దీంతో ఇది ఆహ్లాదకరంగా మారింది.

అధునాతనంగా..

సత్యనారాయణపురంలో అరెకరాలో పార్కును అత్యంత అధునాతనంగా తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పార్కు చుట్టూ మొక్కలు నాటారు. పార్కులో పచ్చికను ఏర్పాటు చేశారు. ప్రహరీ చుట్టూ విద్యుత్ కాంతులు మెరిసేలా లైట్లను అమర్చారు. సిమెంట్ కుర్చీలు, వ్యాయామం చేసేందుకు వీలుగా పలు రకాల పరికరాలను ఏర్పాటు చేశారు. ఈ తరుణంలో వాకింగ్, వ్యాయామం చేసుకునేందుకు స్థానిక ప్రజలు తెల్లవారుజామున భారీగా విచ్చేస్తున్నారు. పాఠశాలల సెలవు రోజుల్లో క్రికెట్, బ్యాడ్మింటన్ ఆడేందుకు పిల్లలు వస్తుండటంతో పార్కులో సందడి వాతావరణం నెలకొంటోంది.

కేన్సర్‌పై వాకర్స్‌కు అవగాహన



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్‌కు అవగాహన సదస్సును స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కేన్సర్‌పై అపోలో హాస్పిటల్ వైద్యులు హరిత అవగాహన కల్పించారు. డాక్టర్ సత్యనాథ్, అధ్యక్షుడు దాసరి అనంతరామారావు, కార్యదర్శి గుర్రం వెంకటసురేంద్రబాబు, గౌరవాధ్యక్షుడు కిలారి తిరుపతినాయుడు, కోశాధికారి అరిగెల సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై కాశీవిశ్వనాథుడు



నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ధ్వజారోహణాన్ని దేవస్థాన ప్రధానార్చకులు వందవాసి విశ్వనాథగురుకుల్, వందవాసి గణేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. శేషవాహనంపై స్వామివారు రాత్రి దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా మురారిశెట్టి వెంకటేశ్వరరావు, శ్రీలక్ష్మి దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య, మహేష్ పర్యవేక్షించారు.

మూలస్థానేశ్వరాలయంలో పూజలు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి వారి దేవస్థానంలో వసంతోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మధుకైటభవధ అలంకారాన్ని ఆదివారం వేడుకగా జరిపారు. ఉభయకర్తగా కనుపర్తి వెంకటసుబ్రహ్మణ్యం వ్యవహరించారు. కాగా కైలాససేవతో వసంతోత్సవాలు సోమవారం ముగియనున్నాయని ఈఓ వేణుగోపాల్ తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం



నెల్లూరు(బృందావనం): రక్తదానం ప్రాణదానంతో సమానమని సాయిదర్బార్ అద్దాల మందిర కమిటీ చైర్మన్ మధుసాయి పేర్కొన్నారు. పద్మావతినగర్‌లోని మందిర ప్రాంగణంలో గల సాయిమాత నిత్యాన్నప్రసాదాలయం ద్వారకామాయిలో రక్తదాన శిబిరాన్ని సాయిదర్బార్ యువ సేవాదళ్ సభ్యుడు కనుమూరు సాయినాథ్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించారు. 77 యూనిట్ల రక్తాన్ని నోవా బ్లడ్ బ్యాంక్ వారు సేకరించారు. మందిర గౌరవ సలహాదారుడు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులను ఆదరిద్దాం



క్యాండిల్ ర్యాలీలో అధికారులు



నెల్లూరు(అర్బన్): హెచ్‌ఐవీ సోకి, ఎయిడ్స్‌తో బాధపడుతున్న రోగులను ప్రేమతో ఆదరించాలని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ డేను పురస్కరించుకొని సంతపేటలోని బీఈడీ కళాశాల నుంచి వైద్యశాఖ కార్యాలయం వరకు క్యాండిళ్లతో ర్యాలీని వైద్యశాఖ ఉద్యోగులు ఆదివారం రాత్రి నిర్వహించారు. ఎయిడ్స్‌తో మృతి చెందిన రోగులకు సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో హెచ్‌ఐవీ రహిత నెల్లూరు జిల్లాగా మార్చేందుకు వైద్యశాఖతో పాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కోరారు. డీఎస్‌ఎంఓ డాక్టర్ సురేంద్ర, డెమో అధికారి శ్రీనివాసులు, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థపరుడు పుచ్చలపల్లి సుందరయ్య



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కోవూరు : విప్లవనేత, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని కోవూరు మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బజార్ సెంటర్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి కమ్యూనిస్ట్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ నేతలు మారుబోయిన సుబ్బారావు, గండవరపు శేషయ్య మాట్లాడుతూ కామ్రేడ్ సుందరయ్య స్వాతంత్ర్యోద్యమంలో జైలుకెళ్లారని గుర్తుచేశారు. భారత విప్లవ ఉద్యమంలో వేలాది మంది కార్యకర్తలను కూడగట్టి ప్రజా ఉద్యమాలు నడిపారన్నారు. నేటి రాజకీయ నాయకులకు పుచ్చలపల్లి ఆదర్శప్రాయులన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు జక్కా శేషమ్మ, చాంద్‌బాషా, రమేష్, విజయ్‌కుమార్, సురేష్, భాస్కర్, వెంకటేశ్వర్లు, నజీర్, బాబు, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఇందుకూరుపేట : మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తరగతి గదుల్లో, క్రీడా మైదానంలో తిరుగుతూ ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు కుశల ప్రశ్నలు వేసుకొంటూ కుటుంబ సభ్యుల వివరాలను ఆరా తీశారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, శ్రీనివాసులు, అలెగ్జాండర్, నాగరాజు, ప్రకాష్, వసుంధర, శారదాంబ, మురళీ, శ్రీనివాసులు, పాండరంగ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపునకు ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం నిర్వహించనున్న హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమానికి భక్తులను ఆహ్వానిస్తున్నామని దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్, ఈఓ వెంకటసుబ్బయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థాన ప్రాంగణంలో కార్యక్రమం ఉదయం 8.30కు ప్రారంభంకానుందని వివరించారు.

మనుబోలులో కార్డన్ సెర్చ్



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మనుబోలు : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న తరుణంలో ఎస్పీ ఆదేశాల మేరకు మనుబోలు మండల కేంద్రంలోని బీసీ కాలనీలో పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా కాలనీలో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను, పలువురి ఇళ్లను తనిఖీ చేశారు. అనుమానాస్పద వస్తువులు, వాహనాలు, లిక్కర్ బాటిల్స్ తదితరాలపై స్థానికులను ఆరా తీశారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐ రాంబాబు, ఎస్సై అజయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

కనులపండువగా పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం



నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డులోని ఇందిరానగర్‌లో గల ముత్తుమారి అమ్మవారి దేవస్థానంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఆలయ వార్షిక మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, నిత్యార్చనను భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం పార్వతీ, పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అగ్నిగుండ పూజ, పూర్ణాహుతి, అగ్నిగుండ ప్రవేశాన్ని రాత్రి ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకుడు గోపీ పర్యవేక్షించారు.

జేఎస్ రెడ్డికి ఘన నివాళి



హాజరైన ప్రముఖులు

నెల్లూరు(బృందావనం): టౌన్‌హాల్ పునర్నిర్మాణ దాత జక్కా శ్రీనివాసులురెడ్డి (జేఎస్ రెడ్డి) సంస్మరణ సభను నగరంలోని పురమందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రేబాల లక్ష్మీనరసారెడ్డి టౌన్‌హాల్ ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పలువురు హాజరయ్యారు. ఆయన మరణం నగరానికి తీరనిలోటని చెప్పారు. నగరంలోని చిల్డ్రన్స్‌పార్క్‌లో జేఎస్ రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగాధరం, తుంగా శివప్రసాద్‌రెడ్డి, డోలేంద్రప్రసాద్, మెట్టు రామచంద్రప్రసాద్, అమరావతి కృష్ణారెడ్డి, పిన్ను గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రవచన సప్తాహం



నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో జగద్గురు ఆదిశంకరాచార్య సంస్మరణోత్సవాలను చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భాష్య సూత్ర ప్రవచన సప్తాహంలో చతుస్సూత్రిపై తిరుపతి కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు ఓరుగంటి శ్రీరామలాలశర్మ ఆదివారం ప్రవచించారు. తొలుత మహన్యాసపూర్వక రుద్రాభిషేక అర్చనలను పవని అనిల్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. చక్రాల ఆనంద్‌కుమార్, తాడికొండ సీతారామశర్మ, డాక్టర్ లక్ష్మీనరసింహశాస్త్రి, నరసింహకుమార్, సాయికుమార్, సుందరరావు, రాధాలక్ష్మి, గిరిజాలక్ష్మి, చక్రాల వేంకటలక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శత చండీయాగం



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో శత చండీయాగ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విశేష పూజలను జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. మందిర నిర్వాహక కమిటీ సభ్యుడు యనమండ్ర నాగదేవీప్రసాద్, మాచవోలు వెంకటసుబ్బయ్య, ధర్మకర్త యనమండ్ర చైతన్యకుమార్, వైష్ణవి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై ప్రసన్న విశ్వేశ్వరుడు



సింహ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడు గ్రామంలో కొలువైన శ్రీఅన్నపూర్ణాంబ సమేత ప్రసన్నవిశ్వేశ్వరుని దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామివారు సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత రథాన్ని వివిధ రకాల పుష్పాలతో అందంగా ముస్తాబు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారిని సింహవాహనంపై కొలువుదీర్చారు. మేళతాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగుతున్న స్వామివారికి గ్రామస్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కనుపూరు సరేంద్రబాబు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్‌ను ఆటో ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని చెముడుగుంట సమీపంలో ఆదివారం జరిగింది. నెల్లూరు వైపు నుంచి గూడూరు వైపు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న నాయుడుపేట పట్టణానికి చెందిన మురళీకృష్ణకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆయన్ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.